క్లుప్తంగా

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై జేసీకి ఫిర్యాదు



జేసీకి వినతిపత్రం ఇస్తున్న జయరాజ్

కంభం: కంభం పంచాయతీ పరిధిలో సర్వే నం.91లో అన్యాక్రాంతమైన విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడి ప్రజాప్రయోజనాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మార్పీఎస్ నాయకుడు నేదరపల్లి జయరాజ్ తెలిపారు. 2021లో ప్రభుత్వ అధికారుల సమక్షంలో సదరు స్థలంలో సచివాలయ నిర్మాణం కోసం పిల్లర్లు వేసి పునాదులు వేశారని, ప్రైవేట్ వ్యక్తులు కోర్టును ఆశ్రయించడంతో నిర్మాణం ఆగిపోయిందన్నారు. గత నెలలో ప్రైవేట్ వ్యక్తులు ఆ స్థలాన్ని చదును చేయగా కంభం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అధికారులు విచారించి అన్యాక్రాంతమైన భూమిని కాపాడేలా చర్యలు తీసుకోవాలని జేసీని కోరినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీటీసీ సభ్యుడు

కంభం: ప్రభుత్వ స్థలాలను చదును చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్ ప్రదీప్ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసారు. కందులాపురం ఇలాకాలో గురుకుల పాఠశాల సమీపంలో మాదిగల శ్మశానవాటిక వద్ద ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు రాత్రి పూట జేసీబీలతో చదును చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంబేద్కర్ సామాజిక భవనానికి, దళితులకు ఇంటి స్థలాలు ఇచ్చేందుకు ఆ భూమిని వినియోగించాలని కోరారు. ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపీటీసీ తెలిపారు.

రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు

గిద్దలూరు రూరల్: రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు, ఎరువులు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో సోమవారం రైతులకు 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకునేందుకు ప్రయత్నించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బి.బాలయ్యయాదవ్, ఏడీఏ డి.బాలాజీనాయక్, ఏఓలు విజయభాస్కర్‌రెడ్డి, రాజేశ్వరి, మహబూబ్‌బాషా, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.


ఉపఖజానాధికారికి సన్మానం



వరకుమార్‌ను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: స్థానిక ఉపఖజానాధికారి పి.వి.ఎల్.ఎన్.వరకుమార్ సేవలు మరువలేనివని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.రవీంద్రారెడ్డి కొనియాడారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ట్రెజరీస్ సర్వీస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా సహాధ్యక్షుడిగా ఎన్నికైన వరకుమార్‌ను సోమవారం విశ్రాంత ఉద్యోగులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబద్ధత గల వ్యక్తికి అసోసియేషన్‌లో సేవ చేసే అవకాశం రావడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు భాస్కర్‌రెడ్డి, రంగయ్య, ఎం.వెంకటస్వామి, వి.వీరారెడ్డి, బాలరంగారెడ్డి, కె.రామయ్య, సుబ్బరత్నం, రామాంజనేయరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామికి ఘనంగా పూజలు



ఆకుపూజలో పాల్గొన్న మహిళలు, భక్తులు

మార్కాపురం: మండలంలోని ఎల్‌బీఎస్ నగర్‌లో భక్తాంజనేయ స్వామి ఆలయ 36వ వార్షికోత్సవం సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈనెల 9వ తేదీ వరకు నిర్వహించనున్న ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ, విశేష పూజలు చేశారు. ఆలయంలో నిర్వహించిన ఆకుపూజలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. మార్కాపురం పట్టణంతోపాటు చింతగుంట్ల, బిరుదులనరవ, ఎల్‌బియస్ నగర్, కోలభీమునిపాడు, జమ్మనపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. 5 రోజులపాటు రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

గురువర్యా.. ఎక్కడయ్యా?

- కొమరోలు హైస్కూల్లో ప్రత్యేక తరగతులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయులు
- తమకు సమాచారమే ఇవ్వలేదంటున్న విద్యార్థులు
- లెక్కల మాస్టర్ యూట్యూబ్ పాఠాలతోనే ఫెయిలయ్యామని ఆవేదన

కొమరోలు:

పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు మే 2 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించినా క్షేత్ర స్థాయిలో ఆచరించడం లేదు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 141 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 84 మంది వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలయ్యారు. వీరికి రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11.45 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాల్సి ఉంది. సోమవారం ఉదయం 10 గంటల వరకు ఒక్క ఉపాధ్యాయుడు రాలేదు. 84 మంది విద్యార్థులకుగాను 10 మందే హాజరయ్యారు. ఉదయం 10 గంటల సమయంలో తెలుగు ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చారు.



ఉపాధ్యాయులు లేని ప్రత్యేక స్టడీ అవర్

ప్రత్యేక తరగతులపై గప్‌చుప్

కొమరోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అత్యధికంగా గణితంలో 81 మంది ఫెయిలయ్యారు. సైన్స్‌లో 35 మంది, సోషల్‌లో 19 మంది, తెలుగులో 13 మంది, ఇంగ్లిష్‌లో ఏడుగురు ఉత్తీర్ణత సాధించలేదు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తమకు తెలియదని, వేరేవారు చెబితే పాఠశాలకు వచ్చామని విద్యార్థులు చెప్పడం గమనార్హం.

యూట్యూబ్ పాఠాలే ముంచాయ్

పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడైన లెక్కల మాస్టర్ 10వ తరగతి విద్యార్థులకు సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ ఆన్ చేసి పాఠాలు చెప్పిన విషయం తాజాగా వెలుగుచూసింది. వారానికి ఒకటిరెండు క్లాసులు మాత్రమే లెక్కలు చెప్పారని, యూట్యూబ్ పాఠాలు అర్థం కాక ఫెయిలయ్యాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

యూట్యూబ్ ఆన్‌చేసి వెళ్లిపోతారు



గణితం తప్ప మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో మంచి ఉత్తీర్ణత కనబరిచా. లెక్కల మాస్టర్ తరగతులు చెప్పేందుకు సరిగా లేదు. దీంతో నాకు గణితంలో 19 మార్కులు వచ్చాయి. అత్యధికంగా తెలుగులో 91 మార్కులు వచ్చాయి. నేను బాగా చదువుతా. పరీక్షలు రాసేంత వరకు గణితంలో శిక్షణ ఇప్పించాలని కోరుతున్నాం.

– బాజీ, 10వ తరగతి విద్యార్థి

యూట్యూబ్ పాఠాలు అర్థం కాలేదు



నాకు గణితంలో 27 మార్కులు రాగా మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో 50కి పైగా మార్కులు వచ్చాయి. నేను పాఠశాలలో బాగా చదువుతా. గణిత మాస్టర్ యూట్యూబ్‌లో వీడియోలు పెట్టి తరగతి గది నుంచి బయటకు వెళ్లిపోయేవారు. దీంతో లెక్కలు అర్థంకాక నాతో సహా చాలా మంది ఫెయిలయ్యారు.

– విక్టర్ కుమార్, 10వ తరగతి విద్యార్థి

మీ ముఖాలకు నేను బియ్యమివ్వను..

- గిద్దలూరులో మహిళలపై ఎండీయూ ఆపరేటర్ దురుసు ప్రవర్తన
- అడ్డగోలుగా సాగుతున్న రేషన్ పంపిణీపై ప్రజల ఆగ్రహం

గిద్దలూరు రూరల్:

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సజావుగా సాగిన రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియను కూటమి పాలకులు ప్రహసనంగా మార్చేశారు. గిద్దలూరు పట్టణంలో బియ్యం కోరుతున్న పేదలను ఎండీయూ ఆపరేటర్లు తూలనాడుతున్న తీరు తీవ్ర చర్చనీయాంశమైంది. పట్టణంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో గల బండల బజారులో నివాసం ఉంటున్న మహిళలు సోమవారం రేషన్ బియ్యం కోసం కార్డులు చేతపట్టుకుని ఎండీయూ వాహనం వద్దకు వెళ్లారు. దీంతో ఆపరేటర్ నాయబ్‌రసూల్ 'మీ ముఖాలకు నేను బియ్యం వెయ్యను. మీ దిక్కున్న చోట చెప్పుకోండి' అంటూ బూతు పురాణం మొదలుపెట్టాడు. దీంతో ఆ మహిళలు నిశ్చేష్టులయ్యారు. ''జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి 'అమ్మా బియ్యం బండి వస్తుంది మీ ఇంటి వద్ద రడీగా ఉండండి' అని చెప్పి వెళ్లే వారు. ఇప్పుడు అలా చెప్పకపోగా దుర్మార్గంగా బూతులు తిడుతున్నారు'' అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని రాజానగర్ శివారులోని జగనన్న కాలనీకి ఎండీయూ వాహనం రావడం లేదని కాలనీవాసులు ఆరోపించారు.



రేషన్ బియ్యం కోసం వీధిలో గుమిగూడిన లబ్ధిదారులు

జగనన్న ప్రభుత్వమే బాగుంది



జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి బియ్యం బండి వస్తోంది, ఎక్కడికీ వెళ్లకండి అని చెప్పి దగ్గర ఉండి వేయించేవారు. అప్పుడే బాగుంది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మీ లాంటోళ్లకు నేను బియ్యం వేయను అని నాయబ్ అనే వ్యక్తి దురుసుగా మాట్లాడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. అతనిపై చర్యలు తీసుకుని బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి.

– మాబున్నీ

రెండు నెలలుగా బియ్యం తీసుకోలేదు



రెండు నెలలుగా బియ్యం తీసుకోలేదు. ఎన్ని సార్లు అడిగినా రేపు రా.. రేపు రా.. అంటూ తిప్పుతున్నారు. బియ్యాన్ని ఎందుకు రాకుండా చేస్తున్నారో అర్థం కావడం లేదు.

– మహబూబీ

అంతా అయోమయంగా ఉంది



రేషన్ బియ్యం డీలర్ వద్ద ఇస్తారో లేక వాహనంలో వచ్చి ఇస్తారో తెలియక అయోమయస్థితిలో ఉన్నాం. ఎప్పుడు ఏ వీధిలో వాహనం నిలిపి బియ్యం ఇస్తారో చెప్పేవారు లేరు. డీలర్ వద్దకు వెళ్తే ఇక్కడ కాదు వాహనం వద్దే ఇస్తారని చెబుతున్నారు. వాహనం వద్ద అడిగితే బియ్యం అయిపోయాయి, మీ కార్డుకు ఇక్కడ కాదు అని చెప్పి ఇవ్వడం లేదు. రెండు నెలలుగా బియ్యం తీసుకోలేదు.

– రాజకుమారి

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉద్యమిస్తాం



మార్కాపురంలో ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు



కంభంలో డీటీకి వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలో ఏపీటీఎఫ్ నేతలు

మార్కాపురం: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ఉద్యమిస్తామని, పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకంగా మారుస్తున్న పాలకుల విధానాలను ప్రతిఘటిస్తామని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి బెజవాడ రఘుబాబు, జిల్లా కార్యదర్శి జె.ఆనందరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చిరంజీవికి అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా రంగం తీవ్ర ఒత్తిడికి గురవుతోందని, దశాబ్దాల నుంచి అమలులో ఉన్న ప్రాథమిక పాఠశాలల వ్యవస్థకు విఘాతం కలుగుతోందన్నారు. ప్రాథమిక పాఠశాలల స్థానంలో కేవలం 1, 2 తరగతులతో వేల సంఖ్యలో ఫౌండేషన్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారని, 8 లేదా 9 రకాల పాఠశాలల ఏర్పాటు కోసం ప్రభుత్వం పథక రచన చేస్తోందన్నారు. ఒక్కో రకమైన పాఠశాలలో ఒక్కో విధంగా విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తులను సూచించడం సరికాదన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలు కొనసాగుతున్న చోట, 6, 7 తరగతులు ఉన్నచోట 4 స్కూల్ అసిస్టెంటు పోస్టులు, అలాగే 6, 7, 8వ తరగతులు ఉన్నచోట ఆరు స్కూల్ అసిస్టెంటు పోస్టులు కొనసాగించాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం రెండు ఎస్‌జీటీ పోస్టులు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలని, సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని, 2003 డీఎస్సీ వారికి ఓపీఎస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించడంతోపాటు ఐఆర్ ప్రకటించాలని, మూడు పెండింగ్ డీఏలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. మార్కాపురం, పెద్దారవీడు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం మండలాల నాయకులు కొండయ్య, మరియదాస్, ఎల్.శ్రీనివాస రావు, బి.శ్రీనివాస నాయక్, బి.బాలూనాయక్, ఎ.శ్రీనివాసరావు, పి.చెన్నకేశవులు, బీవీ కోటయ్య, కృపాదానం, బి.పాండు, ఎస్ఏ అబ్దుల్ కలాం పాల్గొన్నారు.

పాఠశాల విద్యలో అసంబద్ధ విధానాలు

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో అసంబద్ధ విధానాలు పాటిస్తోందని ఏపీటీఎఫ్ నాయకులు విమర్శించారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ గిద్దలూరు జోనల్ కన్వీనర్ టి.సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో 117 జీఓను రద్దు చేస్తామని చెప్పిన నారా లోకేష్ అధికారంలోకి వచ్చిన తరువాత దానిని రద్దు చేయకుండా కొత్తగా పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి తీసుకురావడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు డి.శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, రమేష్‌బాబు, రమణారెడ్డి, సయ్యద్‌రఫీ, నంద్యాల శ్రీనివాసులు, కేశవ్‌రావు, బి.భాస్కర్‌నాయుడు, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంభం: ప్రభుత్వ పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.మల్లికార్జునరావు అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వపాఠశాలల పరిరక్షణకు ఉద్యమించాలని డిమాండ్ చేస్తూ మే 5న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన, మే 9న జిల్లా కేంద్రాలలో కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నా, మే 14న విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం డిప్యూటి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ భాస్కర్, పగడాల పాండు, మునగాల మురళి, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణరావు, అంకిరెడ్డి, హరిబాబుల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, నాగేశ్వరరావు, కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవం

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, పోలేరమ్మతల్లి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం ఉదయం గణపతి పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రికి మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్రపై పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బుధవారం విశేష పూజలతోపాటు విగ్రహాల గ్రామోత్సవం, సాయంత్రం కేరళ వాయిద్యాలతో స్వామివారి ఊరేగింపు, రాత్రికి విద్యుత్ ప్రభపై సాంస్కృతిక కార్యక్రమాలు, గురువారం విగ్రహాల ప్రతిష్ఠ, అన్న సంతర్పణ, రాత్రికి మహిళల కోలాట ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ఎల్లటేనుగుపై ఊరేగిన చెన్నకేశవుడు



కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతీ సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. సోమవారం స్వామివారు ఎల్లటేనుగుపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ ఉభయదాతలుగా గొంటువారిపల్లి, మూలెవారిపల్లి గ్రామస్తులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. మంగళవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

తప్పిపోయిన చిన్నారి తల్లిదండ్రుల చెంతకు..

మార్కాపురం టౌన్: తప్పిపోయిన బాలుడిని పోలీసులు గంట వ్యవధిలో కనుగొని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. ఈ సంఘటన మార్కాపురం టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దారవీడు మండలం గుండంచర్ల గ్రామానికి చెందిన గోరంట్ల శివరామకృష్ణారెడ్డి తన తండ్రి రాజేశ్వరరెడ్డితో కలిసి మార్కాపురం పట్టణానికి వచ్చాడు. స్థానిక స్టూడియోస్ బజారులోని వినోద్ హాస్పిటల్ వద్ద బాలుడు తప్పిపోయాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్సై సైదుబాబు తన సిబ్బందిని పురమాయించి సీసీ ఫుటేజ్ పరిశీలించారు. సోషల్ మీడియా వేదికగా బాలుడి ఫొటోలు షేర్ చేయడంతో నెహ్రూ బజారులో కనుగొని బాలుడి తండ్రికి అప్పగించారు.



బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్సై సైదుబాబు

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



అన్నా రాంబాబును సన్మానిస్తున్న ధర్మానాయక్ తదితరులు

మార్కాపురం: పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎంప్లాయీస్, పెన్షన్ల శాఖ కార్యదర్శిగా ఎంపికైన పెద్దదోర్నాల మాజీ ఎంపీపీ జి.ధర్మానాయక్‌కు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి అన్నా రాంబాబు సూచించారు. పెన్షనర్ల విభాగం నాయకులు సోమవారం నెల్లూరు జిల్లా వైఎస్సార్ సీపీ అబ్జర్వర్, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డితోపాటు అన్నా రాంబాబును కలిసి సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు లెక్చరర్ పత్తి వెంగన్న, బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పత్తి రవిచంద్ర, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, వార్డు ఇన్‌చార్జి ఉత్తమ్‌కుమార్, గాయం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం అర్జీలు పరిష్కరించాలి



అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: మీకోసం కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే అర్జీలను పరిష్కరించడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సబ్‌కలెక్టర్ త్రివినాగ్ ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తన ప్లాట్‌కు నకిలీ పట్టా సృష్టించి కొందరు ఇబ్బంది పెడుతున్నారని, విచారించి న్యాయం చేయాలని కొమరోలు మండలం తాటిచెర్ల గ్రామానికి చెందిన చల్లా నడిపి రంగయ్య అర్జీ ఇచ్చారు. భూ సమస్యను పరిష్కరించాలని తర్లుపాడు మండలం గానుగపెంట గ్రామానికి చెందిన కొమ్ము దేవయ్య కోరారు. పలువురు అందజేసిన అర్జీలను ఆయా మండలాలకు పంపి పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

బేస్తవారిపేట: క్రమం తప్పకుండా పుస్తకాలు చదివితే విజ్ఞానం పెంపొందించుకోవచ్చని గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు, అబ్దుల్‌కలాం, మదర్ థెరిసా గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్, పుస్తక పఠనం, బొమ్మలు వేయడం, చెస్, కథలు చదడంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాల్లో శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐదుగురు విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వం ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 2004–05వ సంవత్సరం 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమానికి నాటి ఉపాధ్యాయులు అనివిలాసిని, నాగేశ్వరరావు, సుబ్బయ్య, పోలయ్య, ఓ.రవిశేఖర్‌రెడ్డి, కె.రవితేజ, వెంకటేశ్వరరెడ్డి, షుకూర్, గోవిందయ్య, వినోద్, విజయసారథి హాజరయ్యారు. విద్యార్థులు పాఠశాలలో కలియదిరిగి చిన్ననాటి సంగతులు గుర్తుచేసుకున్నారు. చదువుచెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం సుధాకర్, పూర్వ విద్యార్థులు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజారామిరెడ్డి పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల మధ్య రగడ

- గ్రామ పార్టీ అధ్యక్షుడి నియామకంలో వివాదం



తెలుగుతమ్ముళ్ల మధ్య వాగ్వివాదం

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడి నియామకం నేపథ్యంలో ఆ పార్టీ నేతల మధ్య విభేదాలు మరోమారు బట్టబయలయ్యాయి. సోమవారం సాయంత్రం స్థానిక అంకాళమ్మతల్లి దేవస్థానం ఆవరణలో బూత్ కమిటీ, గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహించేందుకు పార్టీ మండల అధ్యక్షుడు చిన్నపురెడ్డి తదితరులు చేరుకున్నారు. ముందుగా బూత్ కమిటీలు నిర్వహించాల్సి ఉండగా వివాదం చోటుచేసుకుంది. ఏ బూత్‌లో ఉండే నాయకులకు ఆ బూత్‌లో మాత్రమే అవకాశం అనడంతో రగడ మొదలైంది. దీంతో ఒకరిపై ఒకరు 'నువ్వెంత.. అంటే నువ్వెంత..?' అంటూ విరుచుకుపడ్డారు. అక్కడ ఉన్న నాయకులు, కార్యకర్తలు సర్దిచెప్పినా ఎవరూ వెనక్కు తగ్గలేదు. వివాదం పెద్దదై ఎన్నిక వాయిదా పడింది. ఇప్పటికే పలు గ్రామాలకు పార్టీ అధ్యక్షులను నియమించగా స్థానిక నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నట్లు సమాచారం.

మండే ఎండ



గత ఐదు రోజులుగా ఉష్ణోగ్రతల నమోదు ఇలా..

వారం	ఉష్ణోగ్రత
సోమవారం	40
ఆదివారం	39
శనివారం	39
శుక్రవారం	39
గురువారం	38

మార్కాపురం: సోమవారం(మండే) ఎండ మండిపోయింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనప్పటికీ తీవ్రత మాత్రం 44 డిగ్రీలుగా చూపింది. దీంతో తీవ్రమైన ఎండ వేడికి ప్రజలు విలవిల్లాడిపోయారు. భానుడి ప్రతాపానికి వీధులన్నీ నిర్మానుష్యమయ్యాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ పశ్చిమ ప్రకాశంలో మాత్రం ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయానికి మార్కాపురం పట్టణంలోని ప్రధాన వీధులైన తర్లుపాడు రోడ్, కోర్టు సెంటరు, కంభం సెంటరు, దోర్నాల బస్టాండు, క్లాక్‌టవర్ ఏరియా, కాలేజీ రోడ్డు, మెయిన్ బజారు ఖాళీ అయ్యాయి. చిరు వ్యాపారులు కూడా ఎండ దెబ్బకు ఇబ్బందిపడ్డారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ సోకకుండా అప్రమత్తంగా ఉండాలి. మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతే తప్ప బయట తిరగవద్దు. చల్లని కూల్ డ్రింక్స్ కూడా తాగకూడదు. మాంసాహారం తినడం తగ్గించడంతోపాటు మద్యం తాగకూడదు. నలుపు దుస్తులు, మందంగా ఉండే దుస్తులు వేసుకోకూడదు. నీరు, పళ్లరసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి. కాటన్ దుస్తులు వేసుకోవాలి. రోజుకు 15 గ్లాసుల వరకు నీరు తాగాలి. భోజనం మితంగా చేయాలి. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు లేదా టోపీ వినియోగించాలి.

– డాక్టర్ పద్మావతి, డీవైఎంహెచ్‌ఓ